విజయ - నవంబర్, 1984

> "పొరపాట్లు మానవ సహజం. చాలా సంప్రదాయాలు
> ఆ పొరపాట్లలోంచే పుట్టుకొస్తూంటాయి–"

# గ్రేస్ పీరియడ్

ఆఫీసుకు టైమయిపోయిందని ఒకటే హడావుడి పడిపోతూంటే శ్రీమతి అడిగింది. "ఇదివరకెప్పుడూ ఇంత హడావుడి పడేవారు కాదు మీరు?"

అవును - నిజమే! ఆర్నెల్ల క్రితం వరకూ ఆఫీసుకు ఇష్టం వచ్చినట్లు వెళ్ళేవాడిని. నా వంటి వారే ఆఫీసులో ఎక్కువగా ఉండడం వల్లనేమో మా ఆఫీసరుగారు కొత్తగా ఎంట్రన్స్ గేటు దగ్గర రిజిష్టర్ ఒకటి పెట్టించాడు. ఆలస్యంగా వచ్చిన వాళ్ళందరూ అందులో సంతకం పెట్టి వచ్చిన టైము వేయాలి. ఆలస్యంగా వచ్చిన వాళ్ళందరి పేర్లూ వేరే జాబితాగా తయారు చేయబడతాయి. ఒకే సంవత్సరంలో మూడుసార్లు ఆలస్యంగా వస్తే ఒక క్యాజువల్ లీవుగా లెక్కవేయబడుతుంది.

రిజిష్టర్ వచ్చేక అందరూ జాగ్రత్త పడిపోయారు. ఎవరో ఒకటీ అరా తప్ప ఇంచుమించు అందరూ టైముకి వస్తున్నారు. నేనూ అంతే! కానీ ఈ ఆర్నెల్ల లోనూ అనుకోకుండా రెండుసార్లు లేటయ్యాను. ఈ రోజు లేటైతే మూడోసారి అవుతుంది. క్యాజువల్ లీవు ఒకటి అన్యాయంగా పోతుంది. అందుకే హడావుడి పడిపోతున్నాను.

"పోనీ సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోండి" అన్నది శ్రీమతి.

"తీరి కూర్చుని ఉత్త పుణ్యానికి సెలవు పెట్టడం ఎందుకూ? అవసరమైతే తిండి మానేసైనా ఆఫీసుకి వెళ్ళిపోతాను" అన్నాను.

శ్రీమతికి వంట లేటైన మాట నిజం. నేను ఆదరాబాదరాగా నాలుగు మెతుకులు తిన్నాననిపించుకొని ఇంట్లోంచి బయటపడి ఒక్క ఉదుటున స్కూటర్ స్టార్టు చేసి ఏ యాక్సిడెంటూ చెయ్యకుండానే ఆఫీసుకు చేరుకున్నాను. కానీ ఎంట్రన్స్ గేటు వద్ద ప్యూను నాకు రిజిష్టర్ చూపించి "సార్ ! సంతకం చేయండి" అన్నాడు.

మధ్యలో వాచీచూసుకుంటే ఆలస్యమైపోతుందని నేను టైము కూడా చూసుకోలేదు. ప్యూన్ రిజిష్టర్ చూపించగానే టైము చూసుకున్నాను. అయిదు నిముషాలు ఆలస్యం అయింది.

కాసేపు నా మనసు అయిదు నిముషాలకూ, క్యాజువల్ లీవుకూ మధ్య

ఊగిసలాడింది.

ఉత్త పుణ్యానికి క్యాజువల్ లీవు తీసుకోవడం ఇష్టంలేదు. కానీ అయిదు నిముషాలు ఆలస్యం. దబాయించి లోపలకు పోదామంటే తోడుగా ఇంకెవ్వరూ నాకు కనబడలేదు.

అప్పుడు నాకు గుర్తువచ్చింది - గ్రేస్ పీరియడ్. ఆఫీసు టైముకు పది నిముషాలు ఆలస్యంగా రావడానికి గ్రేస్ పీరియడ్ ఉంది. మా ఆఫీసు టైము పదీ పది. ఇప్పుడు టైము పదింపావయింది. అంటే నేనింకా గ్రేస్ పీరియడ్‌లోనే ఉన్నాను. ఆ విషయమే ప్యూన్‌కు చెప్పి లోపలకు వెళ్ళబోయాను.

"నాకదేం తెలియదు సార్ - మీరు సంతకం పెట్టాలి" అన్నాడతడు.

నాకు కోపం వచ్చింది "నేను సంతకం పెట్టను. కావాలంటే ఫిర్యాదు చేసుకో" అని లోపలకు వెళ్లిపోయాను.

ఆఫీసులో నా పని నేను చూసుకుంటుండగా నాకు మా బాస్ నుంచి పిలుపు వచ్చింది. వెళ్ళాను.

"నువ్వు అయిదు నిముషాలు ఆలస్యంగా వచ్చి సంతకం పెట్టనన్నావుట" అన్నాడు బాస్.

"ఆఫీసుకు ఆలస్యంగా రావడానికి పది నిముషాలు గ్రేస్ పీరియడ్ ఉంది. ఆ లోగా వస్తే నేను ఎందుకు సంతకం పెట్టాలి?" అన్నాను.

బాస్ నేను చెప్పిన వివరాలన్నీ విని "సరేలే! ఆఫీసరుగారితో నేను మాట్లాడతాను" అన్నాడు.

కాసేపు గడిచింది. మళ్ళీ నాకు బాస్ నుంచి పిలుపు వచ్చింది. వెళ్ళాను.

"గ్రేస్ పీరియడ్‌లో వస్తే అది ఆలస్యంగా లెక్క పెట్టకపోవచ్చు. కానీ నువ్వు సంతకం పెట్టి తీరాల్సిందే" అన్నాడు బాస్.

"రిజిష్టర్లో సంతకం పెట్టాల్సొచ్చే మాటయితే ఇంక గ్రేస్ పీరియడెందుకు?" అన్నాను.

"అవన్నీ నాకు తెలియదు. నీ క్యాజువల్ లీవు పోకుండా చూసే బాధ్యత నాది. నువ్వు రిజిష్టర్లో సంతకం పెట్టేసేయ్. లేకపోతే ఆఫీసరు నీ మీద డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటాట్ట" అన్నాడు బాస్.

డిసిప్లినరీ యాక్షన్ అనగానే నాకు చాలా కోపం వచ్చింది. "గ్రేస్ పీరియడ్లో ఇంతవరకూ రిజిష్టర్లో సంతకాలు పెట్టిన వారు లేరు. ఈ సంగతేమిటో చూడాల్సిందే! తీసుకోమనండి డిసిప్లినరీ యాక్షన్. ఆయనెలా తీసుకుంటాడో చూస్తాను" అన్నాను.

బాస్ ఏమీ మాట్లాడలేదు. ఆఫీసరుతో గొడవ పెట్టుకోవడం ఆయన కిష్టముండదు. ఆ సంగతి నాకు తెలుసు.

అందుకే నేను మా యూనియన్ లీడర్ గంగరాజు వద్దకు వెళ్ళాను. విషయం చెప్పాను.

"ఏమిటీ - గ్రేస్ పీరియడ్‌లో సంతకం పెట్టాలా - నువ్వు చాలా మంచి పని

చేశావు. ఇది మన యూనియన్‌కే సవాలు. ఇంక నువ్వు పోయి నీ పని చేసుకో. నేను చూసుకుంటాను" అన్నాడు గంగరాజు.

ఈలోగా బాస్ నన్ను పిలిచి "బహుశా నీ మీద డిసిప్లినరీ యాక్షన్ తీసుకోవడం నాకు తప్పదు, ఆఫీసర్ చెప్పిన ప్రకారము చేసుకుపోవాలి నేను. అన్యథా భావించకు" అన్నాడు.

"అదంతా మా యూనియన్ చూసుకుంటుందిలెండి" అన్నాను.

ఈలోగా గంగరాజు చాలా హడావుడి చేశాడు. మధ్యాహ్నం లంచవర్లో అతడు మమ్మల్నందర్నీ సమావేశపరచి ఆవేశంగా మాట్లాడేడు. అవసరమైతే ఈవిషయమై సమ్మె చేయాలన్నాడు. అందరూ గంగరాజు మాటలకు సై అన్నాం.

ఇక్కడ గంగరాజిలా హడావుడి చేస్తుంటే అక్కడ ఆఫీసరూ పట్టుదలగా ఉన్నాడు. నా మీద ఆయనకు చాలా కోపం వచ్చింది. ఎలాగో అలా నాకు ఆఫీసు మెమో ఇవ్వాలని ఆయన చూస్తున్నాడు. అందుకని రూల్సుబుక్సన్నీ తిరగేస్తూ రూల్సు విషయంలో జమా జెట్టీ అనిపించుకున్న సాంబమూర్తిని ఆశ్రయించాడు. సాంబమూర్తి ఆయన కుడిభుజం.

నాకు మనసులో రవంత భయం పీకుతోంది. సాంబమూర్తి సలహాలకు కోర్టులో కూడా అప్పీలుండదంటారు. ఆయన నా మీద తిరుగులేని కేసు తయారుచేస్తాడేమోనని నా భయం. ఒక చిన్న క్యాజువల్ లీవు కోసం బంగారంలాంటి భవిష్యత్తును పాడుచేసుకోవడం లేదు గదా అన్న అనుమానము నన్ను బాధిస్తోంది.

అందుకే వీలు చూసుకుని ఒకసారి సాంబమూర్తిని రహస్యంగా కలిశాను. ఆయన నా వంక చూసి "గోటితో పోయే దానికి గొడ్డలి పని కల్పించావు. సంతకం పెట్టేస్తే వదిలిపోయేది" అన్నాడు.

"ఇప్పుడు నేనేం చేసేది? సంతకం పెడతానన్నా మా యూనియన్ ఒప్పుకోదు. అయినా నేను చేసింది అంతపెద్ద తప్పంటారా?" అన్నాను.

"గ్రేస్ పీరియడ్లో సంతకం పెట్టాలని లేదు. కానీ అంత మాత్రాన గ్రేస్‌పీరియడ్ నీకు హక్కు కాదు. అది ఆఫీసరు ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. ఆయన సంతకం పెట్టమంటే పెట్టేయాల్సిందే. లేకపోతే ఇన్‌డిసిప్లిన్ అవుతుంది. నీ మీద డిసిప్లినరీ యాక్షన్ తీసుకోవచ్చు" అన్నాడు సాంబమూర్తి.

"తీసుకుంటున్నారా?"

"వద్దని నేను సలహా ఇచ్చాను. నా సలహా ఆయన పాటించకపోయినా ఆయనకు నేను సాయపడక తప్పదు. ఈ కేసులో నువ్వు నెగ్గవు."

నాకు భయం వేసింది. అది నేను బయటకు కనపడనీయకుండా "అయితే ఆయన నాకుమెమో ఇస్తాడంటారా?" అనడిగాను. ఆయన మెమో ఇవ్వాలంటే అందుకు నా బాస్ కూడా సహకరించాలి. నా బాస్ ఆఫీసరు ఆజ్ఞలను శిరసా వహించడంలో అగ్రగణ్యుడు.

"చెప్పలేను. ఆయన కూడా ఏ విషయమూ గంగరాజుతో మాట్లాడాక

తేల్చాలనుకుంటున్నాడు. గంగరాజు బెదిరింపులకు అస్తమానూ లొంగడాయన. కాస్త తిక్క మనిషి" అన్నాడు సాంబమూర్తి.

నేను గంగరాజు సామర్థ్యాన్నే నమ్ముకున్నాను. ఆ రోజంతా నా మనసు మనసులో లేదు. ఈ గొడవ ఫలితం ఎలాగున్నా నష్టమంటూ కలిగితే అది నా ఒక్కడికే! నా కొలీగ్సందరూ మాత్రం నాకు ధైర్యం చెప్పారు.

గంగరాజుకూ ఆఫీసరుకూ మధ్య అరగంట సంభాషణలు నడిచాయి. ఆఫీసరు చాలా పట్టుదలగా ఉన్నాడుట.

"గ్రేస్ పీరియడ్లో రావడానికి అంగీకరించడం నా ఇష్టం. అది మీ హక్కు కాదు" అని ఆయన గంగరాజుకు స్పష్టంగా చెప్పాడుట.

అప్పుడు గంగరాజు "మీరంత పట్టుదలగా ఉంటే మేమూ ఈ విషయమై గట్టి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. రేపు మేమందరమూ గ్రేస్ పీరియడ్లోనే వస్తాం. ఒక్కరం కూడా సంతకాలు పెట్టం. ఇది చాలా దూరం వెడుతుంది" అన్నాడుట.

ఈ సవాలుకు ఆఫీసరు భయపడ్డాడు. ఆయన తాత్కాలికంగా శాంతించి, "సరే, ఈ రోజు దాకా అయిందేదో అయిపోయింది. గ్రేస్ పీరియడ్లో వచ్చిన వారందరూ విధిగా రిజిష్టర్లో సంతకం చేయాలని నోటీసొకటి ఇప్పిస్తాను. ఎటొచ్చీ ఆ టైములో రావడం ఆలస్యంగా పరిగణించబడదు" అన్నాడుట.

అప్పటికి గంగరాజు కూడా దీనికి ఒప్పుకున్నాడుట. ప్రస్తుతానికీ సంతకం సమస్య తేలితే ఆ నోటీసు విషయం మరోసారి చూసుకోవచ్చునని అతడు అనుకున్నాడుట. అదీకాక రోజూ గ్రేస్ పీరియడ్లో వచ్చిన వారందరూ సంతకాలు పెడుతూనే ఉన్నారుట. నేను అనే దాకా ఈ విషయం ఎవరికీ స్ఫురించలేదుట.

ఏమయితేనేం నాకో పెద్ద ఇబ్బంది తప్పింది.

ఆ సాయంత్రం జరిగినదంతా సవివరంగా శ్రీమతికి చెప్పాను.

శ్రీమతి అంతా విని, "ఔనూ! మీ ఆఫీసు పది గంటలకు కదా – మీరు వెళ్లింది పదింపావుకు గదా మీరు గ్రేస్పీరియడ్ దాటిపోయారు. ఈ విషయం ఎవరూ అనలేదెందుకు?" అన్నది.

నేను 'అరే!' అన్నాను. మా ఆఫీసు టైము పది! పది నిముషాల గ్రేస్ పీరియడ్ దానికి కలిపి పదీ పది అయింది. మా దృష్టిలో అదే ఆఫీసు టయిం అయిపోయింది. అంత కాలం అందరూ పదీ పది దాటితే సంతకాలు పెట్టడానికి కారణం అదే!

అయితే ఈ విషయం ఆఫీసులో ఎవరికీ గుర్తు లేదేమిటి?

నేను, నా సహోద్యోగులు, నా బాస్, రూల్సు తెలుసుననుకునే సాంబమూర్తీ, క్రమశిక్షణ గురించి బాధపడే ఆఫీసరూ అందరూ కూడాఆఫీసు టయిము పదీ పది అనే భావిస్తున్నాము.

అంటే అందరూ గ్రేస్ పీరియడ్ను ఎప్పుడో తమ హక్కుగా భావించేశారు!

✦ ✦ ✦